క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

వంగర: మండలంలోని శ్రీహరిపురం ఆర్అండ్ ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని, సీతారాములకు పూజలు చేశారు. రాష్ట్రంలోని ప్రజలంతా బాగుండాలని కోరుకున్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సి.హెచ్.కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వివిధ పుస్తకాలు, కథలు చదివించడం, కథలు చెప్పించడం వంటివి చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా భాషపై మక్కువ పెరగడంతో పాటు మంచి, మంచి విషయాలు తెలుస్తాయన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజాం సిటీ: మండలంలోని గురవాం గ్రామంలో శివపార్వతుల కల్యాణోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉమారామలింగేశ్వరాలయ 19వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు జాడ సంతోష్కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

మద్యంసీసాలు స్వాధీనం



వంగర: పట్టుబడిన మద్యంసీసాలను చూపిస్తున్న పోలీసులు

వంగర: మండలంలోని మద్దివలస మద్యం దుకాణం నుంచి అక్రమంగా తరలిస్తున్న 100 మద్యంసీసాలను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వై.వి.జనార్ధన్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, కొప్పర గ్రామానికి చెందిన ఓ మద్యం వ్యాపారిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

సంతకవిటి: మండల పరిధిలోని జి.ఎస్.పురం గ్రామంలోని ఓ కిరాణా షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 46 మద్యంసీసాలను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు.

ముగిసిన మజ్జిగౌరమ్మ జాతర మహోత్సవాలు



పూజలందుకుంటున్న మజ్జిగౌరమ్మ

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మజ్జి గౌరమ్మ జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాలు జరిగినన్ని రోజులు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అర్చనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

అభివృద్ధిలో ఘనం.. రామభద్రపురం!

- ప్రగతి పథాన రామభద్రపురం మేజర్ పంచాయతీ
- కుల, మత, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం
- నాలుగున్నరేళ్లలో గ్రామంలోని లబ్ధిదారులకు రూ.73,90,80,622 లబ్ధి
- సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి పరిపాలనపై గ్రామస్తుల హర్షం



రామభద్రపురంలో కొత్తగా నిర్మించిన సచివాలయ, రైతు భరోసా కేంద్రం భవనాలు

రామభద్రపురం: కులం చూడం.. మతం చూడం.. పార్టీలు చూడం.. అర్హులై ఉంటే చాలు సంక్షేమ పథకాలు అందిస్తాం.. అభివృద్ధి చేస్తామంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పదేపదే చెబుతున్న మాటలకు రామభద్రపురం మేజర్ పంచాయతీ సజీవసాక్ష్యంగా నిలుస్తోంది. గ్రామంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుండడమే కాకుండా వివక్షకు తావులేకుండా అభివృద్ధి పనులు సైతం జరిగాయి. టీడీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గ్రామంగా రామభద్రపురం ప్రసిద్ధి కాగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ అభివృద్ధి కొత్తపుంతలు తొక్కింది. గ్రామంలో కొత్తగా సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు నిర్మించారు. ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు పొందేలా గ్రామ జనాభా ప్రాతిపదికన 3 సచివాలయాలు నిర్మించారు." రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు 2 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. సీఎం జగనన్న సంకల్పంతో ఆవిర్భవించిన గ్రామసచివాలయం, ఆర్బీకేలతో పాలన సులభతరమైంది. ఫలితంగా ప్రజలకు సులువుగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. నాడు–నేడు పథకం, నాబార్డు కింద పాఠశాలల మరమ్మతులు, అదనపు తరగతి గదుల నిర్మాణం జరిగి, ఇప్పుడు అవి కార్పొరేట్ విద్యాసంస్థలను తలపిస్తున్నాయి.

ఇది కదా.. అభివృద్ధి



నిర్మాణ దశలో పేదవారికి అందించిన జగనన్న కాలనీ ఇళ్లు

అభివృద్ధి పనులు ఇలా..

గ్రామంలో రూ.1.30 కోట్ల వ్యయంతో మూడు సచివాలయాలు, రూ.47.88 లక్షల వ్యయంతో రెండు ఆర్బీకేలు నిర్మించారు. రూ.7.29 కోట్ల ఉపాధి హామీ నిధులు, రూ.60 లక్షల జీజీఎంపీ నిధులు, రూ.20.80 లక్షలు ఎంపీపీ నిధులతో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు నిర్మించారు. నాడు–నేడు పథకం కింద మొదటి దశలో రూ.13.81 లక్షల వ్యయంతో ప్రాథమిక పాఠశాల రూపురేఖలు మార్చగా, రూ.2.30 కోట్ల నాబార్డు నిధులతో ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులు, వాటిలో మౌలిక వసతులు కల్పించారు. నాడు–నేడు రెండో విడతలో రూ.92.18 లక్షల అంచనా వ్యయంతో 5 పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక వసతులు కల్పిస్తున్నారు. గ్రామంలో 500 మంది పైబడి అర్హులైన పేదలకు జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాలు కూడా అందించడం విశేషం.



నాబార్డు నిధులతో కొత్తగా నిర్మించిన అదనపు తరగతి గదులు



గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చొక్కాపు వీధిలో కొత్తగా వేసిన సీసీ రోడ్డు



అగురువీధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన సీసీ కాలువ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

ప్రజలందరూ బాగుంటేనే సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నమ్మింది. ఇందుకు తగ్గట్టుగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అవినీతి, అక్రమాలకు తావులేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తోంది. గతంలో ఎన్నడూ లేనంతగా రామభద్రపురంలో గడప గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఒకటో తేదీనే పింఛన్లు అందుతుండడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు సంతోషంగా జీవిస్తున్నారు. విద్యాదీవెన, వసతిదీవెన, అమ్మఒడి, విద్యాకానుక పథకాలు విద్యార్థుల ఉన్నత చదువులకు దోహదపడుతున్నాయి. పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత, ఆసరా పథకాలు భరోసాగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు ప్రత్యక్షంగా రూ.53,11,10,164, పరోక్షంగా రూ.20,79,70,458 మొత్తంగా రూ.73,90,80,622 ప్రయోజనం చేకూరింది.

సీఎం జగనన్న మేలు మరువలేం..



సీఎం జగనన్న ప్రజలకు చేస్తున్న మేలు మరువలేం. ఆయన పుణ్యమా అని మా కాలనీకి మహర్దశ పట్టింది. ఎంతోమందికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు కాలనీలో ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజాసమస్యలకు పరిష్కారం చూపారు. రానున్న ఎన్నికల్లోనూ ఆయనను గెలిపించి, రుణం తీర్చుకుంటాం.

–సొండి దయామణి, రామభద్రపురం.

జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్లల్లో ప్రభుత్వం నుంచి సాయం అందడంతో ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపడ్డాయి. మేలు చేసిన వైఎస్సార్సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ జనం కోరుకుంటున్నారు.

–చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీపీ రామభద్రపురం.

సచివాలయాలతోనే.. గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం

- సచివాలయం ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



రేగిడి: సరసనాపల్లిలో శిలాఫలకం ఆవిష్కరించి, సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

రేగిడి: రాష్ట్రంలోని సచివాలయ వ్యవస్థతో మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధ్యమైందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని సరసనాపల్లి గ్రామంలో రూ.43 లక్షల నిధులతో కొత్తగా నిర్మించిన గ్రామసచివాలయ భవనాన్ని ఆదివారం వారు కలిసి ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సచివాలయాల ద్వారా గ్రామంలోనే ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డికే దక్కుతుందన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు రిజిస్ట్రేషన్లు కూడా సచివాలయాల్లోనే రూపాయి ఖర్చు లేకుండా అందివ్వడం జరుగుతోందన్నారు. వీటితో పాటు ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలో గ్రామస్తుల మౌలిక అవసరాలు తీరేలా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రజల బాగు కోరే సీఎం జగనన్నను రానున్న ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజాపాలన సులభతరం చేసిన నాయకుడు మన జగనన్న అని, ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను ఎన్నో రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని, అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాయన్నారు. అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్న గొప్ప నాయకుడు సీఎం జగన్ అని, ఆయనకు మనమంతా అండగా నిలవాలన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నేతలు చెప్పే మాయ మాటలు నమ్మి, మరోసారి మోసపోవద్దని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించి, సీఎం జగన్కు బహుమతిగా ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ కర్రి అప్పలనాయుడు, ఎంపీటీసీ కెల్ల మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో రైతులకు రాజులకు మధ్యే పోటీ



బాడంగి: సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బాడంగి: రానున్న ఎన్నికల్లో బొబ్బిలి నియోజకవర్గంలో రైతులకు రాజులకు మధ్యే పోటీ అన్న విషయం ఓటర్లంతా గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా కొత్తగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గంలో అత్యధికులు బీసీలు ఉండగా, వారిలో ఒకరికి ఎమ్మెల్యే సీటు కేటాయించే దమ్ము టీడీపీ పార్టీకి లేదన్నారు. నియోజకవర్గంలో ఒక్క శాతం కూడా లేని రాజులకు టీడీపీ టికెట్ ఇచ్చేందుకు సిద్ధమైందని, గతంలో రాజులు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి అయినా కూడా నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. టీడీపీ బీసీలపై సవతిప్రేమ చూపిస్తోందని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో ఇక్కడి బీసీలంతా టీడీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రజలు ఎన్నుకుంటారన్నారు. అన్నివర్గాల్లోని ప్రజలకు ప్రభుత్వం ద్వారా లబ్ధి జరిగిందని, లబ్ధి పొందిన వారంతా పార్టీకి ఓటు వేసేలా చూడాలన్నారు. పక్కాగా ఓటర్ల జాబితా రూపొందేలా చూడాలని, పార్టీ సానుభూతిపరుల ఓట్లు గల్లంతు కాకుండా చూడాలన్నారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్లలోనే 40 ఏళ్లలో జరగాల్సిన అభివృద్ధి, సంక్షేమం చేసి చూపించామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ చెప్పే మాయమాటలను నమ్మొద్దని, బంగారు భవిష్యత్ కావాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు, పార్టీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, పార్టీ మండల ఎన్నికల ఇన్చార్జ్ శంబంగి శ్రీకాంత్, ఎంపీపీ భోగి గౌరి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

బొబ్బిలి: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు చేపడుతున్న ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పట్టణంలో అడిషన్ల కోసం తిరుగాడుతున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును ఏఐఎస్ఎఫ్ సభ్యులు ఆదివారం అడ్డుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్లు సేకరిస్తున్నాయని, అలాంటి పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని కోరారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

రామభద్రపురం: మండల కేంద్రం నుంచి బొబ్బిలి వెళ్లే రోడ్డులో ఉన్న చొక్కాపువాని చెరువు వద్ద ద్విచక్ర వాహనం, లారీ ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో కొండాల నూకరాజు అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. బొబ్బిలి రావువారి వీధికి చెందిన నూకరాజు మండల కేంద్రంలోని ఓ హోటల్లో వంటపని చేస్తుంటాడు. శనివారం రాత్రి పని అయిన తర్వాత విశాఖపట్నం నుంచి వచ్చిన ఆయన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై బొబ్బిలి వెళ్తుండగా, చెరువు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల సహకారంతో 108 అంబులెన్స్లో బొబ్బిలి సీహెచ్సీకి తరలించి, చికిత్స అందజేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఈఈ మెరిట్ టెస్ట్లో విద్యార్థి ప్రతిభ



రవిచంద్రకు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

రాజాం: రాష్ట్ర స్థాయి ఈఈ(ఎడ్యుకేషన్ ఎపిఫనీ) మెరిట్ టెస్ట్లో మండలంలోని డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థి గార రవిచంద్ర ప్రతిభ కనబరిచాడు. రెండు రోజుల క్రితం ఆన్లైన్ ద్వారా ఎన్జీవో నిర్వహించిన ఈ టెస్ట్లో సదరు విద్యార్థి జిల్లా స్థాయిలో రెండో ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థికి ఈ నెల 17వ తేదీన విజయవాడలో మాకినేని బసవపున్నయ్య కేంద్రం వద్ద స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్కుమార్, ఈఈఎంటీ జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.సుబ్బారావుతో పాటు కన్వీనర్ పి.ఎస్.ఆర్.సి.మూర్తిలు నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లతో సన్మానించారు. ఈ మేరకు పాఠశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

జగనన్న కాలనీ ఇళ్లకు విద్యుత్ మీటర్ల ఏర్పాటు



విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రీషియన్లు

రాజాం: పట్టణ పరిధిలోని కంచరాం సమీపంలో ఉన్న జగనన్న కాలనీ ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఆదివారం ఏర్పాటు చేశారు. మొత్తం రూ.80 లక్షల నిధులతో 1200 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామని ఏఈ కుమార్ ఆదివారం తెలిపారు. లబ్ధిదారుల కొత్త ఇంటి వద్దకు లైన్మేన్లు వెళ్లి మరీ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు.

22న కృష్ణ మాస్టారు విగ్రహావిష్కరణ



కృష్ణ మాస్టారు సేవలను కొనియాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఏగిరెడ్డి కృష్ణ మాస్టారు విగ్రహావిష్కరణ ఈ నెల 22వ తేదీన జరగనుంది. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదివారం కలిసి, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృష్ణ మాస్టారు గ్రామాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన గొప్పవ్యక్తి కృష్ణ మాస్టారు అని, ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, డీసీసీబీ డైరెక్టర్, మాజీ జెడ్పీటీసీ బోను అప్పలనాయుడు, ఉద్దవోలు సర్పంచ్ ఎచ్చెర్ల సునీత విజయప్రసాద్ తదితరులు ఉన్నారు.